

# ఆ ఇల్లు మూతవడ్డది

పెద్దింటి అశోక్‌కుమార్

"బాపూ... మక్క ప్యాలాలే."

"వద్దు బిడ్డా కడుపు నొత్తది."

"ఏం నొయ్యదే... అబ్బ ఒక్కటేనే... కొనియ్యే... ఊ... ఊ... ఊ... కొనియ్యవే."

"పాప్‌కార్న్... గరమ్... గరమ్... పాప్‌కార్న్... పోతే దొరుకయి," చేతిల బుట్ట, బుట్ట నిండ పాకెట్లు, బస్సులో అటూ ఇటూ తిరుగుతున్నాడు ఒక పిల్లగాడు.

ఏడుపును విని అక్కడినే నిలబడి ఇంకోసారి, "పాప్‌కార్న్..." అన్నడు.

ఈసారి తల్లిదిక్కు తిరిగిండు పిల్లగాడు. "అవ్వా... కొనియ్యే... ఒక్కటినే! మల్లడుగనే... ఊ... ఊ..." రాగం అందుకున్నడు.

"వద్దు బిడ్డ... ఇంటికి పోయినంక బుగ్గలేంచి పెడుత..." తల్లి సముదాయించింది. కొడుకు వినలేదు. రాగం అందుకున్నడు.

ముగ్గురినీ చూసి నవ్వుకుంట దగ్గరగా వచ్చి, "పాప్‌కార్న్ గరం... గరం..." అన్నడు పిల్లగాడు. కొడుకు రాగం ఎక్కువయింది. ధర్మయ్యకు కోపమచ్చింది. అమ్ముకునే పిల్లగాన్ని ఇరుగజూసిండు. బుట్టల నుంచి ఒక పాకెట్‌ను మునివేళ్లతో తీసి కొడుక్కు ఇచ్చిండు. అదే చేత్తో అంగి జేబులోంచి రూపాయి బిళ్లను తీసి ఇచ్చిండు.

బిళ్లను అటూ ఇటూ తిప్పి చూసి జేబుల ఏసుకుంటూ, "ఇంకో రూపాయి," అన్నడు.

"ఏంది...? ఈ పొట్లంకు రెండు రూపాయలా? చారెడులెవ్వు! అడ్డికి పావుశేరు అమ్మవడితివి," పాకెట్‌ను ఒత్తి చూస్తూ అన్నది దేవవ్వ.

తల్లి చేతిలోని పొట్లంను అందుకుని పండ్లతో చింపిండు కొడుకు.

"రెండు రూపాయలుగాదు... వట్టిగనే ఇత్తరు," ఎక్కసంగా అంటూ చేతిని సాపిండు పిల్లగాడు.

ధర్మయ్యకు రేషమచ్చింది. అంగి జేబు బనీను జేబు వెదికి రూపాయి బిళ్లను ఇస్తూ, "మన పెరట్ల ఒక చిలుక బుక్కినన్ని కావు," అన్నడు నవ్వు మొఖంతో.

దేవవ్వ నవ్వలేదు. బరువుగా చూసింది.

ఆమె చూపు అర్థమైనట్టు, "మన చేన్ల పండిన గింజలే... ఎక్కడెక్కడో తిరిగి మన నోట్లెకే వచ్చినయి. కాకపోతే పైసలు పెడుతున్నం," అన్నడు ధర్మయ్య.

"ప్యాలాల మిషిని కొన్నడా..." కిటికిల నుంచి బస్టాండులకు తొంగి చూస్తూ అన్నది దేవవ్వ.

"కొనలేదు. గుత్త పట్టుకున్నడు. అక్కడ మిగిలిన మక్కలను ఇక్కడికే తెచ్చిండట," చెప్పిండు ధర్మయ్య.

దేవవ్వ కండ్లల్ల నీళ్లు తిరిగినయి. భర్తకు కనిపించకుంట తుడుచుకుంటూ, "పల్లికాయ పంట ఏసినోళ్లను గూడా ఆగం జేత్తండట..." అన్నది.

అప్పటికి ఇంకా బస్సు నిండలేదు. ప్లాట్‌ఫారం మీద నిలవడ్డది. ఎక్కేవాళ్లు ఎక్కుతున్నరు. దిగేవాళ్లు దిగుతున్నరు.

ఇద్దరూ సీటు మీద బీరిపోయి కూసున్నరు. నడుమ కూసుండి కొడుకు ముక్కప్యాలాలు బుక్కుతండు.

ఇద్దరి మనసుల్లో సుడి తిరిగే బాధ ఒక్కటే. ఒకరినొకరు అడగాలనుకుని ఇష్టంలేక ఆగిపోతున్నరు. చివరికి తనే బయటపడింది దేవవ్వ.

"ఎట్ల...? ఊర్లెకు పోతున్నం. గనీ మనను బతుక నిత్తరా... ఆరునెలల జీతం ముట్టె. ఇప్పుడు ఇయ్యి మంటే యాడిస్తం. వచ్చి వారమన్నా గడవకపాయె," భయంభయంగా అన్నది.

ధర్మయ్యకు రేషమూ, కోపమూ పొడుచు కచ్చినయి. మొఖం బిగుసుకుపోయింది. "ఉండ నియ్యక సంపుతడా...? సంపేదాకా పురస్తు. దుకాణంల జీతముండుటకు వచ్చిన గనీ... పెండ అమ్ముడుకు వచ్చిన్నా... అదీ... నా ఎద్దు పెండను నన్నే ఆవు పెండని అవద్దమాడి అమ్ముమంటడా..." అన్నడు.

ధర్మయ్య అట్ల అన్నడో లేదో వెనుక నుంచి కోపంగా, "ఔ అమ్మాలె. తవ్వేడు కైకిలి ఇత్తే తంగేళ్లు పీకుమంటే పీకాలె. నువ్వచ్చిందే కైకిలికి. బిచ్చానికచ్చి అంబిల్లు గరుత్తవా...?" కొత్త గొంతు వినిపించింది.

గొంతును గుర్తుపట్టి ఇద్దరూ భయంభయంగా పక్కకు తిరిగి చూసింగ్రు. ఎదురుగా లింగయ్య సేటు. బగ్గున మండుతున్నడు. మొఖం నిండా కోపం. ఇద్దరినీ గుంజుకపోదామా అన్నట్టున్నడు.

"చెప్పక చెయ్యక బస్సెక్కింగ్రు. ఇదేనా మునాసం. ఇయ్యంగ కట్టలకు కట్టలు అందుకున్నరు. ఇప్పుడు నన్ను పరేషాన్ జేత్తుంగ్రు..." గాయికెత్తు కున్నడు సేటు.

భార్యాభర్తలిద్దరూ బయపడ్డరు. నోట్లె తడారి పోయింది. ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. అసలు అట్లా వస్తడని కూడా వాళ్లూహించలేదు. దేవవ్వ భయం తో ముడుచుకుంది. ధర్మయ్యనే అన్నడు నసిగినట్టు.

"పరిషాన్ అయింది నువ్వా నేనా...? ఏం పనికి తోలుకచ్చినవు. ఏం పని జేపిత్తన్నవు. నీకు అమ్ముడు పోయిన్నమనుకుంటున్నవా...?"

అతని మాటలు పూర్తికానే లేదు, అందుకున్నడు సేటు. "నాకు నీతిలేదు సరే! నువ్వు నీతి వున్న మనిషివే గదా! అడ్వాన్సుగ తీసుకున్న పైసలు నాయి నాకు ఇయ్యి. నీ జోలికి వార్తకు వత్తే పాత చెప్పుతోని గొట్టు," నిలదీసినట్టుగా అన్నడు సేటు.

బస్సంతా బొబ్బ. అందరు లేచి నిలబడి చూస్తు న్నరు. భార్యాభర్తలిద్దరు భయంతో ఒదిగి చూస్తున్నరు. కొడుకు ఇద్దరి మధ్య బెదురుగా కూసున్నడు.

"ఇత్త... ఇయ్యకపోతే ఎగవెడుతనా...? ఇప్పటి కిప్పుడు ఇయ్యిమంటే నడుముకు ముడేసుకున్ననా! ఇంటికి పోయినంక ఇత్త," తనకుతాను ధైర్యం తెచ్చు కుంటూ అన్నడు ధర్మయ్య.

"ఇత్తవు ఇత్తవు... ఇంటికాడ ముల్లెగట్టి మూలకు దాచినవు. పొంగనే ఇడిసి కట్ట గట్టిత్తవు నా పాత... నా పైసలు నాకిచ్చేదాక ఇంట్ల నుంచి కదులద్దు. నడువు... బస్సు దిగు..." కోపంగా అన్నడు సేటు.

ధర్మయ్య బక్కపల్చటి మనిషి. సేటు కుంబ కర్ణుడు. అతని ఆకారం, బొబ్బ, కోపం ధర్మయ్యలో భయాన్ని పెంచుతుంది. దేవవ్వ అవమానంతో తలెత్తడంలేదు.

చుట్టూ వున్న జనానికి ఏదో కొద్దికొద్దిగా అర్థమై నట్టుంది. ధర్మయ్యను పారిపోతున్న దొంగను చూసి నట్టుగా చూస్తున్నరు.

ముందు నుంచి ఎవరో, "ఏ... ఏం కొట్లాట. కిందికి దిగుంగ్రి. ఎక్కేటోళ్లను ఎక్కనిత్తలేరు..." అన్నడు గట్టిగ.

సేటు అడుగు కూడా ముందుకు కదులలేదు. ధర్మయ్యను చూస్తూ, "ఏయ్... ఇత్తవా వత్తవా చెప్పు," చిటికెలు గొడుతూ అన్నడు.

ధర్మయ్యకు కోపం ఆగలేదు. "నేను నీ ఇంటికి రాను. ఊరికి పోతున్న. నీ పైసలు నీకు లెక్కగట్టి ఇత్త. ఇక్కడ నువ్వు ఒర్రకు... ఇజ్జత్ తియ్యకు," మొండిగ అన్నడు.

సేటు చుట్టూ ఉన్నోళ్లతో, "సూడుంగ్రయ్యా వీని కత. అన్నం బెట్టినందుకు నాకే సున్నం బెడుతండు..." అంటూ జరిగిందంతా చెప్పుతుండు.

అది విని, "అరే... అట్లనా... అట్ల జేసుడు తప్పే..." అంటున్నరు వాళ్లు.

"జర నోట్లె ఊంచుంగ్రి... సిగ్గు మానమత్తది..." అంటుండు సేటు.

దేవవ్వ గుండె కలుక్కుమంది. ధర్మయ్య మాత్రం, "జీతమున్ననని వీడు చెప్పింది చెయ్యల్నట. రేపు నాలుగు ఇండ్లు దోసుకరమ్మంటే దోసుక రావాలె గదా..." అన్నడు.

సేటు ఎగపోత్తండు. చెమటలు కక్కుతుండు. మొఖం గండుపిల్లి లెక్కయింది. గావువట్టె బైండ్లోని లెక్క ఉగ్రం మీదున్నడు. కండ్లు ఎర్రగైనయి.

"ఏయ్... చెప్పు... ఇత్తవా... వత్తవా...? నిన్ను నమ్ముకుని వెయిల మాలు గుత్తకు పట్టుకున్న.." సేటు ఎగపోత్తండు.

ధర్మయ్యకు భయం కాలేదు. తెగింపు వచ్చింది. సూటిగా నిలబడి, "ఐదు పైసలియ్య... నీ దమ్మున్న జాగల చెప్పుకో... ఇట్లనే ఒర్రితే లావట్టి బస్సు కింద

ఎత్తేత్త... ఇప్పటికప్పుడు యాడి నుంచి తేవాలె...'' అన్నడు.

''తేకుంటే పెండ్లాన్ని కుదవెట్టాలె... ఇంత రేషము న్నోనివి ఎందుకు జీతమున్నవు...'' సేటు అంటనే వున్నడు, దేవవ్వ ఫక్కుమని ఏడ్చింది. తల్లిని చూసి కొడుకు గూడా ఏడుపును అందుకున్నడు.

ధర్మయ్యకు కోపం ఆగలేదు. ఇసురుగ లేసిండు.

''బోషిడికే... నా పెండ్లాంను కుదవపెట్టాలె నారా...? నీకావురంగు... నీకు పైస మదం బాగుంది...'' అంటూ లేచి గల్లను అందుకున్నడు.

సేటు కొన్ని క్షణాలు బీరపోయిండు. తర్వాత దమ్మును కూడదీసుకుని కోపంగా, ''బంచోత్... నన్ను గల్లవడుతావురా... నీ తల్లి... నీ దమ్మెంత... వొసతెంత?'' అని రెండు దెబ్బలేసిండు.

సీట్ల నడుమ ఇద్దరు కలెవడ్డరు. అవ్వ కొడుకు లిద్దరు ఏడుత్తండ్రు. చుట్టూ ఉన్నోళ్లు నవ్వుతున్నరు.

డ్రైవర్ ఎక్కినట్టున్నడు. బస్సు చాలయింది. ''ఏయ్... వాళ్లిద్దరినీ కిందికి నూకుండ్రి,'' కండక్టర్ అరిచిండు. చుట్టు కూసున్నోళ్లు ఇద్దరినీ విడదీసిండ్రు.

సేటు ఆగకుంటా ఎగపోత్తండు. ఎగపోత్తూ తిడు తున్నడు. ఎవలో అతన్ని ముందుకు నెట్టుకపోయిండ్రు. ధర్మయ్య ఆయాసంగా సీట్లో కూసున్నడు. దేవవ్వ తల దించుకుని ఎగతడుతుంది.

సేటు బస్సు దిగుతూ దిగుతూ మందిని దులప రిచ్చుకుని ముందుకు వచ్చి, ''నువ్వు ఊర్లెకైతే నడువు. గావువట్టి మమ్మాయండుత బిడ్డా... నీకు నిలువ నీడ లేకుంట జెయ్యకపోతే నా పేరు లింగమే కాదు...'' చూపుడువేలును ఊపుతూ ఉగ్రంగా బస్సు దిగిపో యిండు.

ఇద్దరూ  చాలాసేపటి వరకూ తేరుకోలేదు. అందరూ తమనే చూస్తూ నవ్వుతున్నట్లుగా అనిపిం చింది. చాలాసేపటి వరకు ఒకరినొకరు చూసుకోలేదు. మాట్లాడుకోలేదు. బస్సు స్టేజిస్టేజికి ఆగుతూ సాగిపో తుంది.

ఊరు దగ్గరవతుంటే దేవవ్వలో భయం పెరిగి పోతుంది. ఆ భయం ఆమెను కుదిపేస్తుంటే గొంతు పెగల్చుకుని, ''మనకంటే ముందే వాడు ఊర్లెకు పోతడు... పంచాది పెట్టిత్తడు. దండుగు ఏత్తరు. ఇచ్చిన పైసలు కట్టమంటరు. ఎట్లన్నగాని... ఆరునెలలు వుందామా మరి?'' అన్నది.

ధర్మయ్య ఈసడింపుగా, ''అడుక్కుతింటగనీ వాని దగ్గర జీతముండ. ఇయ్యల పెండ అమ్ము మన్నడు. రేపు రోత తినుమంటడు...'' అన్నడు.

ఏదో స్టేజీ. బస్సు ఆగి మళ్లీ కదిలింది. కొడుకు జోగుతుంటే తొడమీద పండుకోబెట్టుకుంది దేవవ్వ.

''ఎట్ల మరి...? మా అన్న దగ్గరికి పోదామా? ఇంతగాకున్నా ఇంతనన్నా సదురుతడు. ఏదన్నా పని జూపిత్తడు,'' దేవవ్వ అన్నది.

ధర్మయ్య విరక్తిగా చూసి, ''అన్నలేదు... తమ్ముడులేదు... వాళ్లే పొక్కగాని పాముల్లెక్క తిరుగు తుండ్రు మననేం ఆదుకుంటరు. అయినా సేటుగాడు మననేం జేత్తడు? పీకుతడా... ఎకురం పొలముంటే కాకుంట జేసిండు. నాగటి మీద ఎడ్లుంటే మలుపు కున్నడు. ఇగ నా దగ్గర ఏముంది. ఏం పీక్కుంటడో పీక్కోని...'' అన్నడు.

దేవవ్వకు మరోసారి కండ్లల్ల నీళ్లు తిరిగినయి.

పొయ్యి మీద మొదలైన పెత్తనం పండిన పంట మీదికి... చేసిన పిడుకల మీదికి... తమ చుట్టు ఎలా తిరిగిందో యాదికచ్చింది.

పొయ్యిల బొగ్గులు... దొడ్లె పెండ... చివరికి తాము ఎలా సేటు కిందికి పోయారో కండ్ల ముందు మెదిలింది.

*

నాగటి సాళ్లల్ల అడుగులు కూరుకపోతున్నయి. అయిటి ముందే వాన. ఇరువాలు మూడు సాల్లు... మడికట్టు అల్లం లెక్క పొతమయింది. వానకు భూమి కాక తీరినా ఎండు దుక్కలో కాళ్లు సుర్రమంటున్నయి.

''ఇంకో వారం ఆగుదాం తియ్యి. ఎవ్వలు దున్నతలేరు. మనమొక్కలమే ఏత్తే కుక్కలు నక్కలకు సాలది,'' గడ్డినలేరుతూ అన్నది దేవవ్వ.

అది రోణికార్తి. రోకండ్లు పలిగే ఎండ. తల దిగపార చెమటలు.

''నీకు తెలవది మొత్తుకోదు. రోణిల మక్కలేత్తే రోకలి బండలోలే కంకులేత్తయి. ఇప్పుడు ఎంత ముందుగ ఏత్తే అంత నయం. కాలం కుదురుకుని చెరువు నిండే వరకు మక్క పంట కోతకత్తది. తర్వాత వరి నాటు పెట్టుకోవచ్చు,'' ధర్మయ్య అన్నడు.

దేవవ్వకు నిజమే అనిపించింది. కాని అంతలోకే అనుమానం. అది కొత్తగా అచ్చు కట్టిన సౌటభూమి. వానలు బాగా కొడితే ఊటలు పుట్టి కప్పలు గుడ్లు పెడుతయి. వరుసగా వారంరోజులు ఎండలు కొడితే

పర్రెలు వాసి చెక్కలు వడ ఎండిపోతది. 'ఏది ఎక్కువైనా కష్టమే! ఎట్లా,' అనుకుంది. అదే మాటను భర్తతో అన్నది.

"నమ్మకం తక్క సుట్టానికి సుఖం లేదట. నీకు అన్నీ అనుమానాలే. చేసినోడు చెడిపోతడా?" అన్నడు గడ్డి కుప్పలు ఎత్తుతూ.

మరునాడే సేటు దగ్గర విత్తనాలు తెచ్చిండు ధర్మయ్య. భూమి పదన తేలిపోకముందే ఇత్తునం పడాలె.

"నాలుగు రోజులు ఆగుదాం తియ్యి. ఇంకో వాన పడని. పిరం ఇత్తునాలు... ఈ చెలుక గుడ్డాన్ని అచ్చు కట్టుడుకే పుట్టెడు బాకీ చేసినం. ఇప్పుడు పంట పండక పోతే సావు మరుణమే అయితది," దేవవ్వ భయంగా హెచ్చరించింది.

ధర్మయ్య వినలేదు. "వానపడితే భూమి గరివడు తది. మళ్లీ రెండుసార్లు దున్నాలె. అప్పటికి ఎండలు కొడితే లింగయ్య సేటు బోరు లేదా! రెండు తడులు తింపుదాం," అంటూ నాగలి కట్టిండు.

ఒడిలో మక్కలు బోసుకొని నాగలి వెంట నడి చింది దేవవ్వ. పురిసిట్లో గింజలు సాలులో పడు తున్నయి. గింజగింజనూ చేతివేళ్లు తడుముతున్నయి. చంటిపిల్లకు స్నానం చేయిస్తూ పెయ్యంతా తడిమినట్లు వేళ్ల సందుల్లో మక్కగింజ తిరుగుతుంది. చెమటను అద్దుకుంటుంది.

సృష్టికార్యంలో కొత్త సృష్టి కోసం తండ్రి నుంచి తల్లిలోకి రాలిన బీజపుచుక్కలా మక్కగింజ మట్టిపొర ల్లోకి కూరుకపోతుంది.

సాలెనుక సాలు... సాలు సాలును కప్పుతుంది. కప్పని సాలును కాలుతో కప్పుతుంది దేవవ్వ. "ఇత్తులు బలే వున్నయి. బిల్లలకు బిల్లలు. బరువు గూడా బాగా వున్నయి," నడుస్తూ అంది దేవవ్వ.

"మనమిచ్చిన పైసలు గూడా... రూపాయి తక్కు వుంటే తీసుకోలేదు సేటు," ధర్మయ్య అన్నడు. చుట్టూ చెట్టూ చేమా లేని బీడు భూములు. మధ్య దీక్షగా సాగు తున్న నాగలి మట్టి పాదాలను ముద్దాడుతూ పాదాల మట్టెలను ముద్దాడుతూ నట్టింట్లో రాశులమై మొలుస్తా మని మట్టిలో మాయమవుతున్న మక్కగింజలు.

ఇది పోషమ్మ గింజ, ఇది మైసమ్మ గింజ, ఇది ఎల్లమ్మ గింజ అని దేవతల పేర్లు పెట్టి భయం భయంగా అయినా నమ్మకంగా ఏస్తుంది దేవవ్వ.

పొద్దుగూకింది. మక్కేసుడయింది. మొగులు గుడ్డు కమ్ముకున్నది. అది చూసి ధర్మయ్య దిగులు పడ్డడు. దేవవ్వ బుగులుపడ్డది. 'అటు ఇత్తనం ఎయ్యం గనే ఇటు వానకొడితే భూమి అట్టుగట్టి ఇత్తునం మొల వది. ఎట్లా...' అనుకున్నరు.

అనుకున్నంత పని అయింది. రాత్రికిరాత్రి కుండ పోత వాన. భూమి కయ్యలుగొట్టింది. ఇద్దరు నెత్తికి చేతులు పెట్టిండ్రు.

నాలుగు రోజులు గడిచింది. పుండు మీద పక్కు గట్టినట్టు దుక్కి మీద మట్టిపొర అట్టుగట్టింది. ఎక్కడా భూమి పొర పొక్కలేదు. ఒక్క మొలక మొలవలేదు. ఇద్దరి నాడులు సల్లవడ్డయి. ఇత్తునం మంచిది గాదేమో అనుకుని సేటు దగ్గరికి పోయిండ్రు.

సేటు ఎగిరిపడ్డడు. "ఆగం అక్కగాదు, కుడుము బుక్కగాదు. మొగులుకే నోరు తెరిచినట్లు ఇటు వాన పడ్డదో లేదో అటు ఇత్తునం ఏత్తివి. ఏసిన్నాడే వానగొట్టె ఎట్ల మొలుత్తది," అన్నడు.

దేవవ్వ ఇంటికచ్చి సోకంబెట్టింది. అయినా మట్టిలో రాలిన మక్కగింజల మీద నమ్మకంపోలేదు. చేన్లకు పోయింది. పిచ్చిది గెలికినట్లు భూమినంతా గెలికింది.

వారం దాటింది. యుద్ధంలో పోరాడి కత్తిడాలు పట్టుకుని బయటకు వచ్చిన సైనికుల్లా ఒక్కొక్క మొలక లేచింది. తప్పిపోయిన బిడ్డ ఇంటికి వచ్చినంత సంతోషపడ్డది దేవవ్వ. కొంకను అందుకుని అంతా తవ్వింది.

మక్క మొలిచిన సంగతి వీళ్ల కంటే సేటునే ఎక్కువ సంతోషపెట్టింది. 'నీళ్లు వున్నా లేకున్నా మొలిచే మొండిరకం,' అని ప్రచారం చేసుకుని రేటు పెంచిండు. ఇచ్చిన ధరను ఎవలకూ చెప్పద్దని చెప్పడానికి ధర్మయ్య ఇంటికి వచ్చిండు.

దేవవ్వ పొయ్యి ముందు కూసుంది. పొయ్యి లంక మండినట్టు మండుతుంది. చెప్పేది చెప్పినంక సేటు కన్ను పొయ్యి మీద, కుప్పజేసిన నిప్పుల మీద పడింది.

"ఏందే... దేవా... అడివినంతా పొయ్యిల వెడు తున్నవు. అగ్గంతా ఏం జేత్తవే," అన్నడు.

"అంతా బూడిదైతది. ఏంజేత్త... ఎత్తి పెంటల వోత్త," నవ్వుతూ అన్నది దేవవ్వ.

సేటు యాష్టగా, "నీ ఇగరం ఇచ్చుకపోను. బొగ్గులు సల్లార్పు. సల్లారిన బొగ్గులను సంచిల పొయ్యి. రోజుకొక్క రూపాయి ఇత్త," అన్నడు.

రూపాయి అనంగనే ఆశ పుట్టింది దేవవ్వకు. ఎట్ల సల్లార్పాలే... ఎట్ల తోడాలె... ఎక్కడ దాయాలె చెప్పిండు

సేటు. కాయకో, కూరకో అయితయని ఒప్పుకుంది దేవవ్వ.

మక్కతో పోటీపడి గడ్డిగాదం లేచింది. ఎండలో ఎండి ఎండలో తడిసి గడ్డిని తవ్వారు ఇద్దరూ. తవ్వుతూ తవ్వుతూ మక్కపంట మీద ఏం చెయ్యాలో చెప్పు కున్నరు.

పాత బాకీ కొంతనైనా తీర్చాలంది ఏదవవ్వ.

"వద్దు వద్దు. తులం బంగారం కొని పుస్తెలతాడు చేయిస్త," అన్నడు ధర్మయ్య.

రెండు వారాలు గడిచింది. మక్క మోకాల ఎత్త యింది. ఎండకు ఎండ, వానకు వాన. పునాసకాలం. మక్కపంటనే నయం అని తెలుసుకొని అందరూ ఇత్తునాలు ఏసే టయానికి ధర్మయ్య మక్క దున్నడానికి వచ్చింది.

బొగ్గుల కోసం ఒకనాడు సేటు ఇంటికచ్చిండు. "పండుడుకో ఎండుడుకోగాని... ధర్మా... నీ మక్కమఱ్ర నిత్తలేదురా... ఒక్కొక్క కఱ్ర కాలు దొడ్డుంది... ఈ పంట తోని నీ దరిద్రం మొత్తం పోతదిరా...రేటు గూడా మంచిగుంది," అన్నడు సేటు.

"నీ దొయ్యల మక్క... ఎయ్యనా సేటు... బోరు వుండనే వుండె," ధర్మయ్య అడిగిండు.

"గా దోతిబట్టంత శిరుకల ఏమెయ్యలెరా... నీ లెక్క ఎకురాల భూమి వుందా... ఎన్నడన్నా కాల్సుక తింటరా అంటే మీరు ఇయ్యరా..." అంటూ పొయ్యి దగ్గరికి వచ్చిండు.

పొయ్యి నిండా అగ్గి వుంది. అగ్గిని చూడంగనే సేటు బగ్గుమన్నడు.

"ఏమాయెనే దేవా... నమ్మినావనొత్తే పుచ్చి బుఱ్ర లైవయట. నమ్మి రోజు రూపాయి ఇత్తున్న. కనీసం పిడికెడు బొగ్గులు నానలేదు. ఇట్లు మండితే బొగ్గులు ఎట్లయితయే..." అంటూ చెంబుతో నీళ్లను అందుకుని పొయ్యిలో పోసిండు.

గయ్యిమని పొయ్యి సల్లారింది. బూడిది పైకి లేచింది. పొయ్యిల నీళ్లు మడుగు కట్టినయి. అన్నంల బూడిది నిండింది. కుతకుత ఉడికి నామునాలు వడ్డది.

దేవవ్వ నొరెత్తలేదు. మొఖం మాడ్సుకుని కట్టె లను ఎగేసింది. ధర్మయ్య గూడా నొరెత్తలేదు. బొగ్గుల పేరు జెప్పి రోజు పది బీడీలు తెచ్చుకుంటుండు.

ఆరోజు నుండి ఎప్పుడు మరిచి వుండలేదు దేవవ్వ. పొయ్యి తనది కాదని తెలిసిపోయినంక ఏదో పరాయి భావన కలిగింది. అగ్గినీ, బొగ్గును తక్కట్ల పెట్టి జోకినట్టు బొగ్గుల సంచిని నింపింది.

మక్క దున్నుకమయింది. వేర్లు తెగేలా దున్నిండు ధర్మయ్య. కఱ్రలను ఎత్తి మన్నుకప్పింది దేవవ్వ. యాకాషి ముసుర్లకు కనుపుల మీద ఏర్లు పుట్టి మొద్దు లోలె కఱ్రలు లేచినయి.

మక్క తల జుట్టు కచ్చింది. పుట్టెడు గడ్డి లేచింది. "గడ్డి పీకి మందు ఎయ్యాలె. లేకుంటే కఱ్ర బలువది," భర్తకు చెప్పింది దేవవ్వ.

దేవవ్వ మనసు నిండా మక్కకఱ్రలే. కఱ్రల చుట్టు ఎన్నో ఆశలను అల్లుకుంది.

"ఈ ముసుర్ల గడ్డీపీకుడు మందు ఏసుడు ఇద్దరితో అయ్యే పనిగాదు. కైకిలి పెడుదాం..." ధర్మయ్య అన్నడు.

"చేతుల నయాపైస లేదు. ఎకురం ఎఱ్రశెలుక కొనుడే దమ్ముకచ్చె. అందిన కాడ అప్పు గుంజుకచ్చి అచ్చు కడితిమి. ఇప్పుడు మందెట్ల కొంటం... కైకిళ్లు ఎట్ల పెడుతం..." దేవవ్వ అన్నది.

అటుఇటు తిరిగి సేటు దగ్గరికే పోయిండు ధర్మయ్య. మిత్తికి రాసుకుని మందు బస్తాలు, కొంత నగదు ఇచ్చిండు సేటు. ఇస్తూ ఇస్తూ పాత బాకి గుర్తు చేసిండు.

వారంల గడ్డి పీకుడయింది. మందు ఏసుడ యింది. కఱ్రలను చూస్తుంటే ఇద్దరికి కడుపు నిండు తుంది. మక్కలనే పొద్దుగూకి తెల్లారుతుంది. మొలిచిన గడ్డిని పీకింఱ్రు. తలజుట్టును ఇరిసి కుప్పలు పోసింఱ్రు. కరుకు మీదున్న కఱ్ర ఆకులు కత్తుల్లా పెయ్యంతా గీరుతున్నా మక్కలనే మెసులుతుంఱ్రు.

మక్క పీసులు ఎల్లింది. ఇంకోసారి దుక్కమసాల అందుకున్నరు. కఱ్రకఱ్రకూ తను ఎతను కతను చెప్పుకుంటూ మసాలా ఏసింఱ్రు. ఎన్ను దగ్గరి పీసులను చూసి మురిసింఱ్రు.

చెట్టు లెక్క మక్క పెరిగింది. సేటు దగ్గర అప్పు పెరిగింది. కఱ్రకు మూడు పీసులేసినయి. ఖాతకు మూడు లెక్కన మిత్తి పెరిగింది.

చుట్టుపక్కల మక్కలు మోకాలెత్తు కాలేదు. ధర్మయ్య మక్క కైలి వారింది. 'అబ్బ ధర్మని మక్కనే మక్కరా!' అన్నరు. కాకులు, చిలుకలు, చుట్టుకున్నయి. మక్కలు మంచె ఏసి జిట్టిబొమ్మ పెట్టిండు ధర్మయ్య.

సరిగ్గా కంకులు పాలువోసుకునే యాళ్ల వానలు గుంజుకున్నయి. ఎండలు దంచి కొట్టినయి. కఱ్రలు వాడిపోయినయి. దానికితోడు రాత్రిపూట నక్కలు, పందులు మక్కలను చీరుకు తింటున్నయి. ఇద్దరూ బీరిపోయింఱ్రు.

దేవవ్వనైతే మొగులుకు మొకంబెట్టి శోకం బెట్టింది. "ఎట్ట...? కాలంల మన్నువడ. ఎంత పనిజేసె. నప్పతుగ బొండిగె ఇరిసె. పందులు పొడుగాను. రాత్రంతా కావలిగాత్తనే ఉంటిమి. యానంగ వత్తన్నయో పొట్టు పొట్టు జేత్తన్నయి. నీళ్లు లేవని ఏడుత్తునా... నిద్ర లేదని ఏడుత్తునా..." అని ఏడ్చింది.

వాన కొరకు ఎట్లెట్ల అని తొక్కులాడుతుండగనే సుట్టుపక్కల మక్క చేనోళ్లు సేటు బోరునుంచి నీళ్లు తెచ్చుకున్నరు. పైపులను సాపి మక్కను పారిచ్చు కున్నరు.

ఎంటనే రెండు తట్టల బొగ్గులైతే జమ చేసుకుని సేటు ఇంటికి పోయిండు ధర్మయ్య. ముందుగా సేటు నీళ్లు ఇయ్యనే ఇయ్యనన్నడు. తరువాత బలవంతంగా ఒప్పుకున్నట్టు చెరిసగం పంట అన్నడు. ధర్మయ్య గుండెల రాయిపడ్డది. మనాదితో ఇంటికచ్చి దేవవ్వతో చెప్పిండు.

దేవవ్వ బగ్గుమన్నది. "పాపపు ముండకొడుకు కమ్మ కాపోల్ల నుంచి పావుశీరుక శెల్కను అన్నయంగ మలుపుకున్నడు అప్పుడు. అండ్ల బోరు ఏసి పంటను మలుకు తింటుండు," అన్నది.

మరో రెండు రోజులయింది. వాన జాడలేదు. మక్క తెట్టిగిలేసింది. ఆకులు తాళ్లు పేనినయి.

"ఎట్ల... నోట్లెకచ్చిన మక్క ఎండిపోవట్టె. ఇట్ల యితే కనీసం సగం పంటైనా చేతికత్తది గదా! నీళ్లు ఇయ్యిమను..." మక్కను సూడలేక తెగాయించి అన్నది దేవవ్వ.

ధర్మయ్య సేటును కలిసి సగం పంట ఒప్పు కున్నడు. సేటు నమ్మలేదు. భార్యాభర్తలిద్దరినీ కూసో బెట్టిండు. ఇద్దరు ముగ్గురు రైతుల్ని కూడా జమ చేసిండు.

"ఇగో... ధర్మా... నాకు ఎవుసం కొత్త. చేను మీదే అనుకోండ్రి. ఇప్పుడు ఎట్ల కావలి గాసిండ్రో అయిపోయే దాకా అట్లనే కావలి గాయాలె. నేను సగమే పొత్తు... నేనెందుకు పోతా... అంటే నడువది. అట్లయితెనే సరే... లేకుంట లేదు..." సేట్ అన్నడు.

ఇద్దరూ తలూపింద్రు. కాయిదం రాసుకుని సంతకాలు తీసుకున్నడు. నీళ్లను ఇడిసిండు. రెండు తడులు తిరిగినయి. మక్క తేరుకుంది... మూరెడు మూరెడు కంకులు... జొన్నిత్తులు పాలువోసినయి.

నక్కలు, పందులు ఎగవడ్డయి. కాకులు, చిలుకలు వశం కాలేదు. చేనంతా తాళ్లు కట్టిండు ధర్మయ్య. డబ్బును అందుకుని లే...లే... ఖడే...ఖడే... అంటూ కాకుల్ని చిలుకల్ని తరుముతుంది దేవవ్వ.

ఇంట్లో పొయ్యి, ఇవతల పొలం... తనయి కావని తెలిసినంక మాట రావద్దని ఖచ్చితంగా కావలి గాస్తుంది దేవవ్వ.

ఒకనాడు దేవవ్వకు జరమచ్చింది. కావలి పోలేదు.కాకులు,చిలుకలు చేను నిండా వాలినయి. అది సేటు చూసిండు. లొల్లి చేసిండు. నలుగురినీ పిలిచి 'థూ' అనిపించిండు. రాత్రిపూట ధర్మయ్య కావలి పోతుండా లేదా చూస్తుండు.

ఒకనాడు ఒడ్డు మీది నుంచి జారిపడ్డడు ధర్మయ్య. రాత్రిపూట ఇంట్లనే పండుకున్నడు. ఎట్ల చూసిండో లింగంసేటు నలుగురిని పిలిచి కాదనిపిం చిండు. అప్పటికప్పుడు కావలి పోయేదాకా పట్టు పట్టిండు.

కంకులు ముదిరినయి. బుక్కితట్టయినయి. కంటికి రెప్పలా కంకిని కాపాడుతున్నరు ఇద్దరు.

ఒకనాడు ధర్మయ్యను పిలిపించుకున్నడు సేటు. బాకీ లెక్క చూసుకున్నడు. కైకిళ్ల పైసలు, మందుబస్తాల పైసలు, దవాఖాన పైసలు, అప్పుడప్పుడు చేపోయి... ఇంట్లకు చిల్లఖాతా పాత బాకీ మొత్తం ఆరువెయిల బాకీ జమయింది.

"అరే ధర్మా... మన చేన్ల పంట ఎన్ని కింటళ్లు అయితదిరా," అడిగాడు సేటు.

"అయితది... పది పదిగేను కింటళ్లు అలాలిసగా అన్నడు ధర్మయ్య.

అక్కడ ఇద్దరు ముగ్గురు రైతలున్నరు. వాళ్లు గూడా నిజమే అన్నరు.

"సరే... పదిహేను కింటళ్లు అనుకుందాం... నీ వంతుకు ఎన్ని కింటళ్లు వత్తయిరా..."

అప్పటికి ధర్మయ్యకు పూర్తి సంగతి అర్థమ యింది.

"ఏడున్నర..." అన్నడు బాధతో.

"ఇప్పుడు కింటలుకు ఐదువందలు నడుత్తుంది. ఏడున్నర కింటాళ్లకు ఎంతయితదిరా..."

ధర్మయ్య సమాధానం చెప్పలేదు. నేలగీతలు గీసిండు. పక్కనున్న రైతులు మాత్రం టక్కున లెక్కగట్టి ఇన్నూటయాభై తక్కో నాలుగు వెయిలు అన్నరు.

"రేపు మక్కకోసుడుకు ఏం లేదన్నా... దోసొతీన్ సౌ కైకిళ్లు కావాలె. ఆ కైకిళ్లు నిన్ను అడుగుతనే లేను... ఇప్పుడు నువ్వు నాకు తేలుతవా... నేను నీకు తేలు తనా..." అడిగిండు సేటు.

ధర్మయ్య నోరు తెరువలేదు. నాలిక సందుల ముల్లు ఇరిగినట్టయింది. పక్క రైతులే, "ఇండ్లేముంది... గిది గుర్రం... అది మైదాన్... లెక్కంత సాపే వుంది... ఇన్నూట యాభై వాడే తేలుతడు," అన్నరు.

సేటు పద్దులు కొట్టేసి ఖాతా రాసుకున్నడు.

ధర్మయ్య ఇంటికి పోయి మలుసుకు పన్నడు. కొట్టికొట్టి అడగంగ నాలుగు ముచ్చట్లు చెప్పిండు దేవవ్వకు. సగమే అనుకున్న పంట పూర్తిగా పోయేసరికి దేవవ్వ మనసు కలికలి అయింది.

మరునాడు పొద్దుగూకే ముందు ధర్మయ్య ఇంటికి వచ్చిండు సేటు. భార్యాభర్తలిద్దరు మాట్లాడ లేదు. కావలిపోలేదని అడిగితేనాలుగు దులుపుదా మనుకుంది దేవవ్వ. కానీ అట్ల అడగలేదు సేటు.

"రేపు ఒక కైకిలి మనిషి కావాలె. నలుపై రూపా యలిత్త. కంకులు కాల్చి అమ్మాలె. నువ్వు వత్తెరా... నువ్వు రానంటే బయట చెప్పుత. మస్తుమంది వత్త నంటున్నరు," అన్నడు పొయ్యిని బొగ్గుల సంచిని చూస్తూ...

ఎవరూ బదులు చెప్పలేదు. బోళ్లు తోముడుకని పొయ్యిల బూడిదిని బొగ్గుల సంచిని ఎత్తుకుని పోయిండు సేటు.

ఇద్దరికీ రోజూ ఉండే ఆగం లేదు. చేను ఏమై పాయెనో అన్న రంధి లేదు. కర్రల మీది ప్రేమ లేదు. ఆగమైన పిల్లికూనల లెక్క అటూ ఇటూ తొక్కుకున్నరు. వట్టిగుండి ఏం చేస్తవని సేటుకు కూలిపోయిండు ధర్మయ్య.

తట్టెడు బొగ్గులు... సంచెడు కంకులు... మూడు తొవ్వలకాడ కూసున్నడు ధర్మయ్య. చిట్టచిట్ట ఏగుతున్న కంకులు పట్టపట్ట అమ్ముడుపోతున్నయి.

బజారు ముందటనే ఇల్లు. కొడుకు కంకులని ఏడుత్తండు. తల్లి కొడుతుంది. కొడుకు ఏడ్చుకుంట బయటికత్తండు. లోపలికి గుంజి తలుపులేత్తుంది దేవవ్వ.

ధర్మయ్యకు కాటికాపరికి అమ్ముడుపోయిన హరిశ్చంద్ర మారాజు యాదికచ్చిండు. 'కాలే బొగ్గు నాది... కాల్చే కంకి నాది. అమ్మేది నేను... వచ్చే పైస మాత్రం నాది కాదు,' అనుకున్నడు.

ఆరోజు పొద్దు గూకినంత మూడువందల ఎనుబై ఆరు రూపాయల లెక్క అప్పజెప్పి నలుపై రూపాయ లతో ఇంటికచ్చిండు ధర్మయ్య.

దేవవ్వ ఒకపక్క మలుసుకు పన్నది. మంకు వట్టిన కొడుకు గచ్చులనే పన్నడు. ఈపు వాతలు తేలింది. చెంపల మీద కన్నీటి మరుకలు. నిద్రలనే, 'అవ్వా... కొట్టకే... కొట్టకే... కంకి కొనియ్యే...' అని కలవ రిత్తండు.

ధర్మయ్యకు దుఃఖమచ్చింది. దుఃఖం కోపంగా మారింది. నడిరాత్రి మక్కచేన్లకు పోయిండు. దొంగ తనంగా ముల్లెడు కంకులు ఇరుసుకున్నడు. ఎత్తుకుని ఇంటికత్తుండు.

నడీబజార్ల దొరికిచ్చుకున్నడు సేటు. ఈపు మీద రెండు గుద్దులు గుద్దిండు. ధర్మయ్య గజ్జుమన్నడు. పంచాది పెట్టి దండుగ తీత్తడని భయమయింది. ముల్లె కింద దించి కాళ్ల మీద పడ్డడు.

"అరేయ్... ఏదో పోనని ఇడిసిపెడుతున్న. ఇట్ల ఎన్ని కంకులు ఎత్తుకపోయినవో... ఇంకోసారి కన్పడితే మక్కలనే పాతరపెడుత. రేపు కైకిలి లేకుండ ఈ కంకుల్ని కాల్చి అమ్మాలె," అన్నడు సేటు.

ధర్మయ్య భయంభయంగా తలూపిండు. తెల్లారి అట్లనే కాల్చి అమ్మి పైసపైసకు లెక్కగట్టి ఇచ్చిండు.

సేటు మక్క చేన్లనే దుకాణం పెట్టిండు. పచ్చి కంకుల్ని సిరిసిల్ల, కామారెడ్డి మార్కెట్లకు పంపి అమ్మిండు. ముందుముందుగా అందిన పంట. అడ్డికి పావుశేరు అమ్ముడయింది. అక్కడొకటి ఇక్కడొకటి ముదిరిన కంకులుంటే ఒలిపిచ్చి పాప్‌కార్న్ మిషినికి పంపిండు.

కంకులన్నీ అయిపోయినంక మక్కసొప్ప కోసు కుందామని సేటును కలిసిండు ధర్మయ్య.

"సొప్పల నాది సగముంటది గదరా... నా సగం నాకియ్యి," సేటు కానూన్‌గా అడిగిండు.

"అది గోజలు తినేది. మనుషులు తినేది కాదు. నాకు రెండు ఎడ్లున్నయని అడుగుతున్న. నువ్వేం చేసు కుంటవు," కోపంగా అడిగిండు ధర్మయ్య.

"తీసుకుంటే తీసుకోగనీ... ఆ ఎడ్ల పెండ ఇయ్యి," అన్నడు సేటు.

ధర్మయ్య కోపం ఆగలేదు. "పెండ ఎందుకు? తింటవా?" బిరుసుగా అన్నడు.

సేటు పకపక నవ్వి, "పిడుకలురా... పిడుకలు చేసుకుంట," అన్నడు.

పెండనే కదా... అనుకుని ధర్మయ్య సరేనన్నడు.

రోజూ పొద్దున ఎడ్ల పాకలకు వచ్చి సానుపుకు మిగిలియ్యకుంట తీసుకపోయేటోడు సేటు. ఒక్క నాడు తట్టెడు తక్కువైతే మీరే తీసుకున్నరని లొల్లి చేస్తండు. భయానికి పెండ ముడతలేదు దేవవ్వ.

కాలం ఎనుకకు వట్టింది. వానలు కొడితే నాట్లు వేద్దామని చేసిన ధర్మయ్య ఆశ నిరాశ అయింది. సేటు ఒకనాడు ధర్మయ్యను పిలిచిండు. ''వారీ... ఉత్తెర దాటింది. ఇక వానలు కొట్టయి. ఏం పనిజెయ్యక ఎట్ల బతుకుతవురా... పల్లి పంటేసుకో. నేను నీళ్లిస్త. సుట్టు ఉన్న రైతులందరు ఏస్తంద్రు,'' అన్నడు.

ధర్మయ్యకు కోపమచ్చింది. ''నేను పల్లెయ్య... సుల్లెయ్య... ఈనగాసి నక్కలకు పెట్టినట్టు... మందిని బతికిచ్చుడు,'' అన్నడు.

లింగంసేటుకు సర్రుమంది. అయినా తమా యించుకుని, ''ఎవలకన్నా పాలుకన్నా ఇయ్యిరా... చేసుకు బతుకుతరు,'' అన్నడు.

ధర్మయ్య ఒప్పుకోలేదు. 'వాన్ని కొట్టుడు నీకు పెట్టుడు,' అనుకున్నడు.

'ఎట్లియ్యవో చూస్త,' అనుకున్నడు సేటు. తెల్లారే పాత బాకీలోళ్లు ఎంటబడ్డరు. పొలంను కుదువబెట్టే దాక వదిలిపెట్టలేదు ధర్మయ్యను. సేటు గూడా బాకీ కోసం గుర్తు జేసిండు. కట్టెదాక కాదన్నడు.

ఎడ్లను అమ్మి వున్న బాకీ కట్టిండు ధర్మయ్య.

''మనసు ఇరిసిండు. వాళ్లను పట్టిండు. వాని మొదలారా... పల్లి ఏపిత్తుండట. మన కలకల మంచిదై తాది...'' దేవవ్వ కలకలాంది. ఎత్తి ఏడుదోసిళ్ల మన్ను వోసింది. సట్టిచ్చి సాపెన వెట్టింది.

ఈ సంగతి సేటుకు తెలిసింది. ధర్మయ్యను పిలి పిచ్చిండు. అగ్గిపెట్టె బీడీల కట్ట ముందటేసిండు.

వద్దనుకున్నా మనసు బీడికట్ట మీదికి గుంజింది. అందుకుని అంటువెట్టిండు ధర్మయ్య.

''వారీ... ధర్మా... నేను మిమ్ములను ముంచిన నని నీ పెండ్లాం అందరితో అంటుందట. ఏం ముంచి నరా...? నీదేమన్నా గుంజుక తిన్ననా...'' సేటు అడిగిండు.

ధర్మయ్య మాట్లాడలేదు.

''అన్నీ లెక్కలు మీకే చెప్పితి. నువ్వు ఒప్పుకున్నవే నాయె...'' బుదురకిత్తండు.

సేటు అట్ల బుదురకొత్తండంటే ఏదో మతులావు వుందని అర్థమైంది ధర్మయ్యకు. అది ఏంటిదో మాత్రం అర్థమైత లేదు. మౌనంగా కూసున్నడు. ఆమాట ఈమాట మాట్లాడి అసలు సంగతికి వచ్చిండు సేటు.

''కామారెడ్డిల మాకు దుకాణముంది. దుకాండ్ల పనుంటది. తిండి వెట్టి నెలకు వెయ్యిరూపాయలిత్త... అడ్వాన్సు ఇయ్యిమన్న ఇత్త. వుంటవా మరి. నీ పెండ్లాం నా మీద మిడుకవట్టె,'' అన్నడు.

ధర్మయ్యకు నెలకు వెయ్యి అంటే మంచిగనే అనిపించింది. ఇప్పుడేగాదు ఎప్పుడైనా సేటు ముచ్చట జెప్పుతుంటే న్యాయమే అనిపిస్తది. చివరికి ఏదో కిరాట్కి ముంటది.

ధర్మయ్య ఆలోచిస్తుంటే సేటే అన్నడు. ''ఇప్పుడే గాదు. రేపు జెప్పు. నీ పెండ్లాన్ని అరుసుకో. దుకాణమన్న ప్పుడు పది పనులుంటయి. ఎన్కసిరి ఇట్లనా అట్లనా అనద్దు,'' సేటు అన్నడు.

తెల్లారి ఆరునెలల అడ్వాన్స్ తీసుకున్నడు ధర్మయ్య.

ఇల్లు ఉరుత్తుందని ఇల్లుసదిరిచ్చిండు. ఇంట్లకు కొంత సామాను తెచ్చిండు. కొంత అప్పు కట్టిండు. వారానికొకసారి వచ్చి చూసి పోతనని సేటుతోని బస్సెక్కిండు.

రెండు రోజులు కిరాణం దుకాణంల సామాన్లు అందిచ్చిండు. నాలుగైదు రోజులు పచ్చి పల్లికాయను రిక్షాల పోసుకుని గల్లీలు తిరిగి అమ్మిండు.

వారం తర్వాత టాక్టర్ నిండ పిడుకలు వచ్చి నయి. ఏం జెయ్యాలెనో అర్థంకాలేదు ధర్మయ్యకు.

సేటే వివరించి చెప్పిండు. ''ఏం లేదురా... ఈ పిడుకలను పెండజెయ్యాలె. ఇప్పుడు కార్తీకనోము లున్నయి. కోటికుంకుమార్చన వుంది. మంచి గిరాకి వుంటది. ఆవుపెండ అని అమ్మాలె.''

ధర్మయ్యకు సుర్రుమంది. ''ఇది ఎడ్లపెండ. దేవుని ముందట అవద్దమాడన్నా... ఇంకే పనన్నా జెప్పు గని ఇది జెయ్య...'' అన్నడు.

''ఈ పని నీ ఒక్కనితోనే అయితదిరా... ఈ పని మా కొడుకో... అల్లుడో జేత్తుండెగనీ వాళ్లు రైతుల లెక్క వుండరు గదా! జనం నమ్మరు...'' సేటు అన్నడు.

ధర్మయ్య ఒప్పుకోలేదు. ''నీకు నీతి లేకపోవచ్చు. నాకుంది. ఆ పాపం ముల్లెగట్టుకోలేను,'' ఖచ్చితంగా జెప్పిండు ధర్మయ్య.

సేటుకు తల దిరిగిపోయింది. పేరుకు పెండనే గని వెయిల బిజినెస్. 'ఇప్పుడే ఇట్ల మర్రవడుతుండు. రేపు అనుపకాయ ఎట్లమ్ముతడు. ఇస్తరాకులు ఎట్లమ్ము తడు,' అనుకున్నడు. బుదురకిచ్చే తరీఖన బుదుర కిచ్చిండు. వినకపోతే బెదిరిచ్చిండు.

''నేను ముందే జెప్పిన... నడుమల ఎత్తయద్దని... అదేం నడువది. జెప్పినపని చెయ్యాలె. నిన్ను కూసుండ బెట్టి మేపుడుకు తెచ్చిన్నా...'' అన్నడు సేటు.

వారంకు వత్తనన్న భర్త రాకపోయేసరికి భయం భయంగా బస్సెక్కింది దేవవ్వ. ధర్మయ్య దేవవ్వకు జరిగిందంతా చెప్పిండు. చెప్పా చెయ్యకుండ నప్పతుగ ఊర్లెకచ్చే బస్సెక్కి కూసున్నరు ఇద్దరు.

*

బస్సు ఆగింది. కుదుపుకు ఇద్దరూ ఉలిక్కి పడ్డరు. ఎవలు ఎక్కడ దిగిపోయింర్రోగని బస్సు మొత్తం ఖాళీ అయింది.

కొడుకును భుజాన వేసుకుని కిందికి దిగిండు ధర్మయ్య. వెంట దేవవ్వ దిగింది. చీపురు నెత్తులు... ఉబ్బిన కండ్లు... జరాన పడ్డట్టున్నరు ఇద్దరు.

కిందికి దిగుతుంటే గుండెలు దప్పలేగినయి.

"అగో... పనిదొంగ ధర్మడు రానే వచ్చిండు..." మందిలోంచి ఎవలో అన్నరు.

విన్నా వినరానట్టే నడుత్తుంర్రు ఇద్దరు. ఇద్దరిని తొవ్వ పొంటి విచిత్రంగా చూస్తుంర్రు జనం.

"వీడు యాడ పోగునొయ్యడేందిరా... సేటునే కొడుతడా..." ఎవరో అన్నరు.

ఇద్దరూ దించిన తల ఎత్తుతలేరు. దొంగతనం చేసి పట్టువడ్డట్టు పతుకులాడుతున్నరు.

"రేపు పంచాది వెట్టి అడిగితె తెలుస్తది. తాత కొడుకు సంగతి..." ఇంకొకరు.

ఇద్దరూ భయంగా ఇల్లు చేరి తలుపు లేసుకున్నరు. దేవవ్వ అట్లనో ఇట్లనో తేరుకుందిగనీ, ధర్మయ్య నోరు దెరుత్తలేదు. మాట మాట్లాడుతలేదు.

దేవవ్వకు కొత్త భయం మొదలయింది. ధర్మయ్య ఎక్కడ సెంచరిల్లుతడోనని కావలిగాత్తుంది. కావలి గాసుకుంటనే బయటి సంగతి తెలుసుకుంటుంది.

ఒకలు దండుగంటున్నరు. ఒకలు జరుమాన అంటున్నరు. ఒకలు పోలీసులంటున్నరు.

పొద్దుగూకింది.

తెల్లారింది.

ఊరు పంచాదికి తయారయింది.

పచ్చగ సానుపు జల్లి ముగ్గుటలేసే ధర్మయ్య వాకిట పొక్కిలి లేచింది.

*నవ్య వారపత్రిక, 18 ఏప్రిల్ 2007*

